## క్లుప్తంగా

### మసీదు వద్ద బ్రిడ్జి నిర్మించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని బుగ్గవంక మీద షామీరియా మసీదు వద్ద బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్, నగర కమిటీ సభ్యురాలు ఎస్.జమీల పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మసీదు వద్ద బుగ్గ వంక మీద బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలన్నారు. గత కొద్ది నెలలుగా బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే జోక్యం చేసుకొని పనులు ప్రారంభించాలన్నారు.

### నేడు క్రైస్తవ సమాఖ్య సమావేశం

కడప కల్చరల్ : గుంటూరు మేత్రాసన గురువులు, క్రైస్తవుల పరిరక్షణ సమితి ప్రతినిధి డాక్టర్ రెవరెండ్ ఫాదర్ బాలస్వామి మంగళవారం కడప నగరంలోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు తెలిపారు. రాష్ట్ర క్రైస్తవుల పరిరక్షణ సమితి ప్రతినిధిగా ప్రభుత్వం ఎంపిక చేసిన గురువు బాలస్వామి ఈ సందర్భంగా రాష్ట్రంలోని క్రైస్తవుల సమస్యల గురించి చర్చించనున్నట్లు తెలిపారు. సీఎస్ఐ చర్చి బిషప్ డాక్టర్ రెవరెండ్ ఐజాక్ వరప్రసాద్, మరియాపురం బిషప్ రెవరెండ్ డాక్టర్ గాలి బాలి ఈ సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో జిల్లాకు చెందిన వివిధ క్రైస్తవ సంఘాల పెద్దలు, పాస్టర్లు, ఫాదర్లు తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో సమర్పించాలని కోరారు.

### రోడ్డు విస్తరణ కోసం తొలగింపు



మాసాపేటలో కూల్చివేత పనులు చేపడుతున్న దృశ్యం

కడప కార్పొరేషన్ : కడప నగరం మాసాపేటలో రోడ్డు విస్తరణ కోసం అత్యంత పురాతనమైన సీతారామాలయం, శివాలయం, పోలేరమ్మ గుడులను కడప నగర పాలక సంస్థ అధికారులు తొలగించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో తొలగించారు. గతంలో ఈ ఆలయాల తొలగింపుపై వివాదం చెలరేగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో విస్తరణ వల్ల ఇళ్లు కోల్పోయే నిరాశ్రయులకు ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలాలు ఇస్తామని, తొలగించిన ఆలయాలను పునర్నిర్మింపజేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో.. మార్గం సుగమమైంది. దీంతో సోమవారం టౌన్‌ప్లానింగ్ సిబ్బంది జేసీబీ సాయంతో ఆలయాలను కూల్చివేశారు. ఈ ఆలయాల తొలగింపుతో మాచుపల్లి రోడ్డులో అభివృద్ధి పనుల వేగం మరింత పుంజుకోనుంది.

### ప్రజా సమస్యలను పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 53 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి-19, టౌన్‌ప్లానింగ్-17, రెవెన్యూ విభాగం-3, హెల్త్ విభాగం-3, యూపీఏ విభాగం-1, సచివాలయ విభాగం-3, కడప తహసీల్దార్-2, సీకే దిన్నె తహసీల్దార్-1, హౌసింగ్-2, హార్టికల్చర్-1, జీజీహెచ్-1 అర్జీలు వచ్చాయి.

- నాగరాజుపేట సెవెంత్ డే ఎడ్వెంటిస్ట్ సెంట్రల్‌చర్చి ప్రహరీగోడ, ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకొని చర్చిలోకి వెళ్లడానికి దారి లేకుండా వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చర్చి ఫాస్టర్ ఎం.మోహన్‌రావు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఎస్ఈ, ఈఈ, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

### 'కార్గో' వినియోగదారులకు బహుమతులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలను పురస్కరించుకుని ప్రతి శుక్రవారం డోర్ డెలివరీ బుక్ చేసుకున్న వినియోగదారుల ఎల్ఆర్ డ్రా తీసి ముగ్గురు విజేతలకు విలువైన కొత్తాస్ వారి బహుమతులు అందజేస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ లక్కీ డిప్‌లో మొదటి బహుమతి ఆనంద్‌కుమార్, రెండవ బహుమతి నాగేంద్ర, మూడవ బహుమతి బేగ్‌లకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, ఏటీఎం కమర్షియల్ జనార్దన్, సీఐ కన్యకుమారి, ఆర్ఎంఈ కేఆర్ చంద్ర, డీఎంఈ బాల వెంకటేశ్, కేజీపీరెడ్డిలు పాల్గొన్నారు.

# దేదీప్యమానం.. కార్తీక దీపం



మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



విశేష అలంకారంలో శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి

కడప కల్చరల్ : కార్తీక దీపం దేదీప్యమానంగా వెలిగింది. కార్తీక మాసంలో రెండో సోమవారం కావడం, మధ్యాహ్నం వరకు పౌర్ణమి గడియలు ఉండడంతో అత్యంత పుణ్యదాయకంగా భావించారు. దీంతో తెల్లవారుజామునే దీపాలు వెలిగించేందుకు పిల్లా పాపలతోసహా తరలి వచ్చారు. నిర్వాహకులు పరిస్థితికి తగినట్లుగా తెల్లవారుజామున 4 గంటలకే స్వామికి విశేష అభిషేకాలు, అలంకారం నిర్వహించి 5 గంటల నుంచి భక్తుల దర్శనానికి అనుమతిచ్చారు. సోమవారం పౌర్ణమి రావడం కూడా భక్తుల రద్దీ పెరగడానికి కారణమైంది. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆలయ ప్రాంగణాలలో దీపాలు వెలిగించి శివపార్వతులను దర్శించుకుని పూజలు చేశారు. మొక్కులు గల వారు పెద్ద ప్రమిదలలో వంద, వెయ్యి, పది వేలు, లక్ష ఒత్తులతో, మరికొందరు నేతి దీపాలు, పిండి దీపాలతో కార్తీక దీపాలను వెలిగించారు. నగరంలోని దాదాపు అన్ని దేవాలయాలలోనూ మధ్యాహ్నం 11 గంటల వరకు ఈ రద్దీ కొనసాగింది.

**కిటకిట..**

కడప నగరంలోని మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయాన్ని కారణాంతరాల వల్ల సోమవారం తెరవకపోవడంతో అక్కడికి వచ్చిన భక్తులందరూ మృత్యుంజయకుంట శివాలయానికి వచ్చి దీపాలు పెట్టారు. దీంతో ఆలయంలో దీపాలకు కేటాయించిన ప్రాంతమే కాకుండా మైదానం కూడా పూర్తిగా దీపాలతో నిండిపోయింది. ఆలయం వెలుపల, రోడ్డుకు ఇరువైపుల పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాలు, జనంతో రద్దీగా కనిపించింది. ఆలయ ఈఓ శ్రీధర్, ఎన్‌సీసీ విద్యార్థుల సహకారంతో కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు చర్యలు చేపట్టారు.

**సైకత లింగానికి పూజలు**

కడప నగరానికి చెందిన భక్తులు వినూత్న రీతిలో శివయ్యకు పూజలు చేస్తున్నారు. భక్తులు ఎక్కువగా తిరగాడని స్థలంలో శివపూజలు నిర్వహించడం మంచిదన్న భావనతో కొత్త పద్ధతులను ఆచరిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక భక్తులు కొందరు కుటుంబాలతో సహా నగర సమీపంలోని వాటర్ గండికి సోమవారం వెళ్లారు. నదిలో స్నానమాచరించి ఇసుకతో శివలింగాన్ని తయారు చేసుకుని సంతృప్తిగా పూజలు నిర్వహించారు. తాము రూపొందించిన సైకత లింగాన్ని చూసుకుని తృప్తి చెందారు.



మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

## అన్నప్రసాదం పంపిణీ



అన్నప్రసాదం అందజేస్తున్న సభ్యులు

కడప అర్బన్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం శ్రీ కాశీ విశ్వనాథ సేవాసమితి, హిమవర్షిణి ఫౌండేషన్, శ్రీ నాగుల వీరభద్రయ్య బ్రాహ్మణ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో కడప నగరం శంకరాపురంలోని శ్రీ అభయాంజనేయస్వామి గుడి వద్ద అన్నప్రసాదం అందించారు. ముఖ్య అతిథిగా నెట్‌నైస్ అధినేత కడిమెల్ల రాణా ప్రతాప్, సంస్థ సభ్యులు రెడ్డెయ్య, ఆర్టీసీ రిటైర్డ్ డీఎం నాగుల రాంప్రసాద్, దామోదరం, రాజశేఖర్‌రెడ్డి, సివిల్ సప్లయ్ సురేష్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్ : సెంట్రల్ జైలు సమీపంలోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో శ్రీ సాయి యువజన సేవా సంఘం అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివునికి అత్యంత ప్రీతికరమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా కడప తిరుమల టింబర్ డిపో అధినేత కె.గోపీక్రిష్ణ, సూర్య డెవలపర్స్ అధినేత కె. సురేంద్రనాథ్‌ల సహకారంతో పేద వృద్ధులకు అన్నప్రసాద వితరణ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు శంకరాపురం అశోక్, వలీబాషా, ఎంవీ క్రిష్ణారెడ్డి, డి.సుబ్బరాయుడు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్ : కడప రాజంపేట రోడ్డులోని చౌడమ్మ వృద్ధాశ్రమంలోని అనాథలకు, వృద్ధులకు ప్రముఖ రచయిత, పదవీ విరమణ హెడ్ మాస్టర్ కల్లూరు బాలయల్లారెడ్డి తన తండ్రి కల్లూరు యల్లారెడ్డి జ్ఞాపకార్థం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. పెన్షనర్ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, సహచరుడు ప్రసాద్‌రెడ్డిలతో కలిసి ఆయన వృద్ధులకు భోజనంతోపాటు స్వీట్లు, అరటిపండ్లను కూడా అందించారు.

## కడపలో చిరుజల్లులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో సోమవారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. అప్పుడప్పుడు సన్నని జల్లులతో ప్రారంభమైన వాన తర్వాత ఓ మోస్తరుగా మారింది. వర్షం రాకతో వాతావరణం చల్లబడింది. చలిగాలులు వీచాయి. రోడ్లు తడిసిపోయాయి. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, వీధి వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వాన వల్ల కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

# మహిమాన్వితుడా.. మణికంతుడా..



స్వామి సేవలో భక్తులు

కడప కల్చరల్ : మహిమాన్వితా దైవమా.. మణికంతుడా.. శరణమయ్యా శరణు శరణు అంటూ అయ్యప్ప మాలధారులు గ్రామోత్సవంలో హరిహర పుత్రున్ని దర్శించుకుని శరణు కోరారు. కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయ ప్రాంగణంలో సోమవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని అత్యంత అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంతుని ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు నిర్వహించి కనుల పండువగా అలంకరించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన చిన్న తేరుపై కొలువుదీర్చారు. అర్చకులు పూజలు చేసి హారతులు ఇచ్చిన అనంతరం నిర్వాహకులు డి.వెంకటరెడ్డి పర్యవేక్షణలో దీక్షధారుల శరణు ఘోష మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అయ్యప్ప భక్తులు, కన్నెస్వాములు పెద్ద ఎత్తున ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. దీపధారులైన మహిళలు ఉత్సవంలో ఇరువైపుల బారులు తీరసాగారు. భక్తులు భజనలతో స్వామికి స్వాగతం పలుకగా, అయ్యప్ప భక్తులు భక్తిగీతాలను ఆలపిస్తూ ఉత్సవంలో సందడి చేశారు. వీధుల్లోని భక్తులు స్వామిని దర్శించుకుని, పూజా ద్రవ్యాలు సమర్పించి హారతులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కళాకారుల కాంతారా విచిత్ర వేషధారణలు ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



దీపాలతో మహిళా భక్తులు



అయ్యప్పస్వామి గ్రామోత్సవం

# జాతీయ కరాటే పోటీల్లో పతకాల పంట



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : తెలంగాణ రాష్ట్రం జడ్చర్లలోని గౌడా ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 26వ తేదీన 16వ నేషనల్ లెవెల్ ఇన్విటేషనల్ కరాటే చాంపియన్ షిప్‌ను జికె మాస్టర్ పోటోకాస్ కరాటే డు ఇండియా వారు నిర్వహించారు. ఈ పోటీల్లో కడప పవన్ కాన్సెప్ట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పలువురు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. అండర్- 10 బాలికల విభాగంలో (కట ఈమెంట్‌లో) మేఘన గోల్డ్ మెడల్ సాధించింది. అండర్ -12 బాలుర విభాగంలో ముదసిర్ గోల్డ్‌మెడల్, విగ్నేష్, కులాయ్‌బాష, దుర్గా హర్షవర్ధన్‌రెడ్డి, మహిధర్, సులేమాన్ సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. అండర్- 12, 13 బాలికల విభాగంలో అను ఏంజల్ బ్రాంజ్ మెడల్‌ను వశం చేసుకుంది. అండర్- 12, 13 బాలుర విభాగంలో యసీస్, కై జ్, కిజర్‌లు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కరాటేమాస్టర్ విజయ్‌తోపాటు విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి అభినందించారు.

# రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీఆర్‌సీసీ సభ్యుడు షామీర్ బాషా

కడప కార్పొరేషన్ : కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను డీఆర్‌సీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం స్టేట్ జనరల్ సెక్రటరీ షామీర్ బాషా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ స్కీం కింద కడప రైల్వేస్టేషన్ ఎంపిక అయిందని, ఈ స్కీంలో సుమారు రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. టీటీల విశ్రాంతి గృహం, స్టేషన్ బిల్డింగ్, ప్లాట్‌ఫారం ఎక్స్‌టెన్షన్, వికలాంగులు, వృద్ధుల కోసం లిఫ్ట్, ఎక్సలేటర్ వంటివి ఏర్పాటు కాబోతున్నాయన్నారు. ఈ పనులు మంజూరు కావడానికి కృషి చేసిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డీఆర్ఎం మనీష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీసీ మెంబర్ డి.మాతయ్య, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఏ.జనార్దన్, ఏఎస్ఐ వెంకటయ్య పాల్గొన్నారు.

# రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం అన్యాయం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చకుండా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది సంవత్సరాలు అవుతున్నా నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. కడప ఉక్కు కర్మాగార నిర్మాణం, దుగ్గరాజపట్నం వద్ద దశల వారీగా భారీ నౌకాశ్రయం, కొత్త రైల్వే జోన్, గ్రీన్ ఫీల్డ్ ముడి చమురు శుద్ధి కర్మాగారం, పెట్రో రసాయన సముదాయం, ఢిల్లీ - ముంబై తరహాలో వైజాగ్ - చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖపట్నం, విజయవాడ, తెనాలి గుంటూరులో మెట్రో రైల్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా చైర్మన్ చిన్న కుల్లాయప్ప, జిల్లా మైనార్టీ వైస్ చైర్మన్ షేక్ అబ్దుల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# అనాథ వృద్ధులకు దుస్తుల పంపిణీ



పవన్ భార్గవ్‌రెడ్డి వర్ధంతిలో రామలింగారెడ్డి కుటుంబ సభ్యులు

వేంపల్లె : అనాథ వృద్ధులకు దుస్తుల పంపిణీతోపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం కడప అక్కాయపల్లెకు చెందిన వడ్డెమాని పవన్ భార్గవ్ రెడ్డి వర్ధంతి సందర్భంగా తల్లిదండ్రులు వి.లక్ష్మీదేవి, రామలింగారెడ్డి చింతకొమ్మదిన్నెలోని గంగమ్మ తోపులోని ఆంజనేయస్వామి ఆలయం, వేంపల్లె రాజీవ్‌కాలనీలోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమం, కడప అజాద్ నగర్‌లోని బృంద వృద్ధాశ్రమం, ఇందిరా నగర్‌లోని పద్మావతి వెంకటేశ్వర ఉచిత వృద్ధాశ్రమాలలో అనాథ వృద్ధులకు వస్త్రదానం చేశారు. కుటుంబ సభ్యులు రాజరాజేశ్వరి, వెంకట సుబ్బారెడ్డి, వెంకట మోహిన్షరెడ్డి, అరుణ కుమారి, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాధవిరెడ్డీ.. మాటలు జాగ్రత్త!

- కడప అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు నీకు లేదు
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్ల ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : కడప నగర అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవిరెడ్డికి లేదని, ప్రగతిపై మాట్లాడకుండా వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్లు మల్లికార్జున, సుబ్బారెడ్డి, షఫీ మండిపడ్డారు. సోమవారం సాయంత్రం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్దనున్న డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాధవిరెడ్డికి కడపపై అంత ప్రేమే ఉంటే ఆమె భర్త శ్రీనివాసులరెడ్డిని చొక్కా పట్టుకొని నిలదీయాలన్నారు. 2014 నుంచి 2019 వరకూ టీడీపీ అధికారంలో ఉందని, కడప నియోజకవర్గానికి శ్రీనివాసులరెడ్డే ఇన్‌చార్జిగా ఉన్నారని గుర్తు చేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కడప అభివృద్ధిపై దృష్టి సారించకుండా కార్పొరేట్ రాజకీయాలు చేశారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను ప్రలోభపెట్టి ఓట్లు దండుకున్నారని, బుగ్గవంకలో నీరు-చెట్టు పనులు చేసి దోచుకుతిన్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధిపై ప్రశ్నిస్తారనే అప్పటి సీఎం చంద్రబాబు జిల్లాకు వచ్చిన ప్రతిసారీ ఎమ్మెల్యే అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబులను గృహ నిర్బంధం చేశారని చెప్పారు. ఎవరో చేసిన పనులను తమ ఘనతగా చెప్పుకున్నట్లు రవీంద్రనగర్ బ్రిడ్జి, వైవీ స్ట్రీట్ రోడ్డు తామే వేశామని మాధవిరెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు. కడప ప్రజలు ఇప్పటి వరకూ కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో మతసామరస్యంతో ఉన్నారని, ఎక్కడి నుంచో వచ్చిన మాధవిరెడ్డి ఆ ఐక్యతను, మతసామరస్యాన్ని దెబ్బతీయవద్దని హితవు పలికారు. సోషల్ మీడియాలో ఆమె పెడుతున్న పోస్టులు ప్రజలను రెచ్చగొట్టేలా ఉన్నాయన్నారు. కడప నగరంలో ప్రస్తుతం రూ.2227 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రూ.10 చలానా కడితే సమాచార హక్కు చట్టం కింద అధికారులు ఆ సమాచారం ఎవరికైనా ఇస్తారన్నారు. మాధవిరెడ్డి నిజానిజాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షంషీర్, కె.బాబు, 36, 50 డివిజన్ల ఇన్‌చార్జులు రఫీ, కె.రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మోటార్ సైకిల్‌ను ఢీకొన్న లారీ

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో డీటీసీ-ఆటోనగర్ మధ్యలో సోమవారం రాత్రి మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కడప ఆలంఖాన్‌పల్లెకు చెందిన కె. నారాయణ (30)కు తీవ్ర గాయాలయ్యాయి. కడప కార్పొరేషన్‌లో చెత్తను సేకరించే వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్న నారాయణ విధులను ముగించుకుని ఒంటిమిట్టలో ఉన్న తన భార్యను చూసేందుకు మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలో షాద్‌నగర్ నుంచి చెన్నైకి ఖాళీ గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న లారీ ఢీకొంది. వెంటనే గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై కడప రిమ్స్ పోలీసు స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు అన్ ఎయిడెడ్, కార్పొరేట్, బడ్జెట్ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు న్యాయపరంగా ఇవ్వవలసిన వాటి గురించి గత నెల 17వ తేదీన పాఠశాల కమిషనర్ ఆయా పాఠశాలల మేనేజ్‌మెంట్‌కు ఉత్తర్వులను పంపారని ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ స్టేట్ కన్వీనర్ గడ్డం రాజు తెలిపారు. కానీ సంబంధిత ఉత్తర్వులను ఆయా పాఠశాలల యాజమాన్యం అమలు చేయలేదని, వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.